సాక్షి అనకాపల్లి

బుధవారం । 22 । నవంబర్ । 2023



తేరుకున్న హార్బర్

బోటు ప్రమాదంతో అతలాకుతలమైన విశాఖ ఫిషింగ్ హార్బర్ తేరుకుంటోంది. కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. 8లో



ఇది కదా అభివృద్ధి

రహదారులు.. ప్రగతి సూచికలు.. ప్రయాణికులనే కాదు మన ఆర్థిక వ్యవస్థనే మంచి దారిలో నడిపించే చక్కని మార్గాలు. 9లో

వాతావరణం

అనకాపల్లిటౌన్:రాగల నాలుగు రోజులు స్వల్ప వర్ష సూచన ఉందని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 22న 4, 23, 24న 1, 25న 2 మి.మీ. వర్షం, 31.8 నుంచి 32.6 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదవుతాయన్నారు.

న్యూస్‌రీల్

గాదిరాయి విద్యార్థినికి గోల్డ్ మెడల్

రాష్ట్ర స్థాయి వ్యాస రచన పోటీలో ప్రతిభ



పుట్టపర్తిలో గోల్డ్ మెడల్ అందుకుంటున్న హేమలత

మాడుగుల: ఇటీవల పుట్టపర్తి సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో 'ఆచార్య దేవోభవ' అనే అంశంపై నిర్వహించిన రాష్ట్ర స్థాయి వ్యాసరచన పోటీల్లో మాడుగుల మండలం గాదిరాయికి చెందిన విద్యార్థిని పాము హేమలత గోల్డ్ మెడల్ సాధించింది. ఈమె గాదిరాయి జెడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతోంది. ఈ పోటీలో రాష్ట్రంలోని 7,225 హైస్కూళ్లతోపాటు కళాశాలలకు చెందిన 3,60580 మంది విద్యార్థులు పాల్గొన్నారు. వీరిలో ముగ్గురు విద్యార్థులు, 33 మంది విద్యార్థినులు గోల్డ్ మెడల్‌కు ఎంపికయ్యారు. మంగళవారం పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో గోల్డ్ మెడల్‌ను హేమలత అందుకుందని సత్యసాయి సేవా సంఘం సభ్యులు పుట్టా బలరామ్, కె.శ్రీనివాసరావు, కె.రాజుకొండలు తెలిపారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, సత్యసాయి సేవా సంఘం మండల సభ్యులు అభినందించారు.

పలు ఆస్పత్రుల్లో పోస్టుల భర్తీ

మహారాణిపేట: జిల్లాలోని పలు ఆస్పత్రుల్లో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ పోస్టులను ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో భర్తీ చేస్తున్నట్లు జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి డాక్టర్ రమేష్ కిషోర్ తెలిపారు. జనరల్ డ్యూటీ అటెండెంట్ మూడు పోస్టులు, పీఎం అసిస్టెంటు ఒక పోస్టు, ఆడియో మెట్రీషియన్ రెండు పోస్టులు, థియేటర్ అసిస్టెంట్ ఒక పోస్టు భర్తీ చేయనున్నట్లు తెలియజేశారు. ఆసక్తి, అర్హత ఉన్న అభ్యర్థులు ఈ నెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఆ రోజు సాయంత్రం 5 గంటల లోపు పెందుర్తిలోని జిల్లా ఆస్పత్రుల సమన్వయ సేవల అధికారి కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఇతర వివరాల కోసం www. visakhapatnam.ap.gov.in వెబ్‌సైట్‌ను పరిశీలించాలని కోరారు.

కోస్ట్‌గార్డ్ రీజియన్ కమాండర్ బాధ్యతల స్వీకరణ

సింధియా : చెన్నైలోని కోస్ట్‌గార్డ్ ఎయిర్‌స్టేషన్‌లో నిర్వహించిన ఉత్సవ కవాతులో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆనంద్ ప్రకాష్ బడోలా నుంచి ఈస్టర్న్ కోస్ట్‌గార్డ్ రీజియన్ కమాండర్‌గా ఇన్‌స్పెక్టర్ జనరల్ డోనీ మైఖేల్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. దీంతో ఆనంద్ ప్రకాష్ బడోలా రెండున్నరేళ్ల కాలం తర్వాత న్యూఢిల్లీని కోస్ట్‌గార్డ్ హెడ్‌క్వార్టర్స్‌కు డిప్యూటీ డైరెక్టర్ జనరల్‌గా శాశ్వత బదిలీపై వెళ్తున్నారు. కొత్త రీజినల్ కమాండర్‌గా బాధ్యతలు స్వీకరించిన ఇన్‌స్పెక్టర్ జనరల్ డోనీ మైఖేల్ చెన్నైలోని లయెలా కళాశాలలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి 1990 జూలై 6న ఇండియన్ కోస్ట్‌గార్డ్‌లో చేరారు.

రిజిస్ట్రేషన్ ఇక ఈజీ..

గ్రామ సచివాలయ వ్యవస్థ పరిపాలన రీతినే మార్చేసింది. ప్రజా సేవలో సరికొత్త నిర్వచనం తీసుకొచ్చింది. ఇప్పటికే ప్రజల ముంగిటకు అన్ని రకాల సేవలను చేరువ చేసింది. ఇదే విధానాన్ని భూముల రిజిస్ట్రేషన్‌లోనూ అమల్లోకి తెచ్చింది. ఫలితంగా చాలా సులభంగా.. తక్కువ సమయంలో గ్రామంలోనే ఈ ప్రక్రియ పూర్తవుతోంది. ఇప్పటి వరకు ఈ ప్రక్రియలో ఎదురవుతున్న ఇబ్బందులు పూర్తిస్థాయిలో తొలగిపోనున్నాయి.

- 20 నిమిషాల్లోనే పూర్తి
- రీ సర్వే పూర్తయి, ఎల్పీ నంబర్ వచ్చిన గ్రామాల్లో ప్రారంభం
- రెండు విడతల్లో 51 సచివాలయాల్లో విజయవంతంగా సేవలు
- జిల్లాలో మూడో విడతగా 173 గ్రామ సచివాలయాల్లోను అమలు
- ఆన్‌లైన్‌లో స్లాట్ బుక్ చేసుకునే అవకాశం

సాక్షి, అనకాపల్లి: సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రభుత్వం వేగవంతం చేసింది. భూముల రిజిస్ట్రేషన్లతోపాటు ఇతర రిజిస్ట్రేషన్లనూ అందుబాటులోకి తీసుకువచ్చింది. ముఖ్యంగా రీ సర్వే పూర్తయిన గ్రామ సచివాలయాల్లో ఈ సేవలు ప్రారంభమయ్యాయి. జిల్లాలో మొదటి, రెండో విడత 51 గ్రామ సచివాలయాలను ఎంపిక చేయగా, తాజాగా మరో 147 గ్రామ సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చారు. ఇంతవరకూ భూములకు సంబంధించి 150 సేవలందించారు.

ఎల్పీ నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్

జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లోని భూములను స్థానిక గ్రామ సచివాలయాల్లో ఎల్పీ (ల్యాండ్ పార్సిల్) నంబర్ ఆధారంగా చేస్తున్నారు.



మొన్నటి వరకూ భూములను సర్వే నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేశారు. ప్రభుత్వం భూముల రీ సర్వే తర్వాత స్థానిక సచివాలయాల్లో ఆ భూముల్ని రిజిస్ట్రేషన్ చేస్తోంది. పంచాయతీ కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి సచివాలయాలకు ఎప్పటికప్పుడు రిజిస్ట్రేషన్లపై సూచనలు, సలహాలు అందిస్తున్నారు.

స్థానిక రిజిస్ట్రేషన్లతో ప్రయోజనాలు

సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు అందుబాటులోకి తీసుకురావడంతో రైతులకు ఎంతో ప్రయోజనం కలుగుతుంది. ఇప్పటి వరకూ రిజిస్ట్రేషన్ల కోసం గ్రామాల నుంచి స్థానిక పట్టణాలు లేదా మండల కేంద్రాలకు వెళ్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో గంటల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ఉండేది. రిజిస్ట్రేషన్లకు సంబంధించి కొంత మంది దళారులు కమీషన్లు తీసుకుని రిజిస్ట్రేషన్లు చేయించేవారు. దాంతో క్రయ, విక్రయదారులు ఆర్థికంగా నష్టపోయేవారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ తీసుకురావడంతోపాటు సచివాలయాలను సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులుగా చేయడంతో ప్రక్రియ సులభమైంది. వ్యయ ప్రయాసలు లేకుండా స్థానికంగానే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకునే సౌకర్యం కల్పించారు. దూర ప్రాంతాలకు వెళ్లి రిజిస్ట్రేషన్లు చేసుకునే భారం తగ్గింది. నూతన పద్ధతిలో భూములకు సౌకర్యం కలిగింది.



అనకాపల్లి వుడ్‌పేటలోని ఎనిమిదో సచివాలయంలో రిజిస్ట్రేషన్ సేవలు

సచివాలయాల్లో సక్సెస్‌ఫుల్‌గా రిజిస్ట్రేషన్లు



గ్రామాల్లో సచివాలయాల్లో సక్సెస్‌ఫుల్‌గా రిజిస్ట్రేషన్ల సేవలందుతున్నాయి. రీసర్వే పూర్తయిన గ్రామ సచివాలయాల్లో సేవలు అందిస్తున్నాం. ఇప్పటికే రెండు విడతల్లో జిల్లాలో 51 సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు అందుబాటులోకి రానున్నాయి. మూడో విడతలో కూడా 173 సచివాలయాల్లో ప్రారంభమయ్యాయి. రిజిస్ట్రేషన్ల ప్రక్రియ పారదర్శకతకు పెద్దపీట వేస్తూ ఏపీ ప్రభుత్వం నూతనంగా 2.0 రిజిస్ట్రేషన్లను అమలు చేస్తోంది. అనకాపల్లి జిల్లాలో ఇప్పటికే 10 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో ప్రారంభమయ్యాయి.

–జానకీదేవి, జిల్లా రిజిస్ట్రార్

దివ్యాంగ విద్యార్థులకు, ప్రత్యేక ఉపాధ్యాయులకు ట్యాబ్‌ల పంపిణీ

అనకాపల్లి టౌన్: దివ్యాంగుల డిజిటల్ విద్యకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని జిల్లా విద్యాశాఖాధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ అన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాల-విద్యాశాఖ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో దృష్టి, వినికిడిలోపం గల దివ్యాంగ విద్యార్థులకు, ప్రత్యేక ఉపాధ్యాయులకు మంగళవారం డిజిటల్ ట్యాబ్‌లు అందజేశారు. జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో డీఈవోతోపాటు అసిస్టెంట్ డైరెక్టర్ ఎ.రవిబాబు, డిప్యూటీ డీఈవో పి.అప్పారావు, సహిత విద్య సమన్వయకర్త శకుంతల పాల్గొన్నారు. జిల్లాలో 24 మండలాలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు, ప్రత్యేక ఉపాధ్యాయులకు రూ.50 లక్షలు విలువ చేసే 165 ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



దివ్యాంగ విద్యార్థి తల్లిదండ్రులకు ట్యాబ్ అందిస్తున్న డీఈవో వెంకటలక్ష్మమ్మ

నేడు యలమంచిలిలో 'జగనన్నకు చెబుదాం'

తుమ్మపాల: యలమంచిలిలో 'జగనన్నకు చెబుదాం' (స్పందన) కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు డీఆర్వో బి.దయానిధి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి, జిల్లా అధికారులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించనున్నట్లు పేర్కొన్నారు. మండలంలో ప్రజలు తమ సమస్యలను అర్జీలరూపంలో పరిష్కరించుకోవాలని సూచించారు.

ఎన్‌ఎంఎంఎస్ హాల్‌టికెట్లు సిద్ధం

విశాఖ విద్య: జాతీయ ఉపకార వేతన పరీక్ష(ఎన్ఎంఎంఎస్) పరీక్ష డిసెంబర్ 3న ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు జరుగుతుందని డీఈవో చంద్రకళ ఒక ప్రకటనలో తెలిపారు. పరీక్షకు హాజరవుతున్న విద్యార్థుల హాల్ టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. www.bsc.ap.gov.in అనే వెబ్‌సైట్‌లో పాఠశాల యు-డైస్ కోడ్ ఉపయోగించి ప్రధానోపాధ్యాయులు హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసి, విద్యార్థులకు అందజేయాలని పేర్కొన్నారు.

రహదారులు సురక్షితం

- 23 శాతం తగ్గిన రోడ్డు ప్రమాదాలు
- నేర సమీక్షలో ఎస్పీ మురళీకృష్ణ

కోటవురట్ల: జిల్లాలో రోడ్డు ప్రమాదాలు 23 శాతం వరకు తగ్గుముఖం పట్టాయని, ఇందుకోసం చేపట్టిన చర్యలు ఫలించాయని ఎస్పీ కె.వి.మురళీకృష్ణ తెలిపారు. ప్రధానంగా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు దృష్టి సారించినట్టు తెలిపారు. స్థానిక పోలీసు స్టేషన్‌ను ఆయన మంగళవారం సందర్శించి పరిసరాలు, రికార్డులు పరిశీలించారు. పెండింగ్ కేసులు, రౌడీ షీటర్లు, ఇన్వెస్టిగేషన్‌కు సంబంధించి ఎస్ఐ నారాయణరావును అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ వార్షిక తనిఖీలో భాగంగానే స్టేషన్‌ను సందర్శించి అన్ని అంశాలు పరిశీలించినట్టు తెలిపారు. ప్రాధాన్యత కలిగిన కేసులను సత్వరమే పరిష్కరించాలని డీఎస్పీ నుంచి ఎస్ఐ స్థాయి వరకు ఆదేశాలు ఇచ్చినట్టు తెలిపారు. జిల్లాలో చాలా వరకు రోడ్డు ప్రమాదాలు తగ్గాయని, పూర్తిస్థాయిలో నివారణకు బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠినంగా వ్యవహరించడం, రహదారుల్లో తుప్పలు తొలగింపు వంటి చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. జిల్లాలో ఎక్కువగా ప్రమాదాలు జరిగే 43 బ్లాక్ స్పాట్లను గుర్తించి ఆర్టీఏ, ఆర్అండ్‌బీ అధికారులతో జాయింట్ యాక్షన్ చేపట్టి, ఇంజినీరింగ్ సైడ్ లోపాలు సరి చేయించడం ద్వారా రోడ్డు ప్రమాదాలు చాలా వరకు తగ్గాయన్నారు. దొంగతనాల నివారణకు కూడా చర్యలు తీసుకున్నామని, పోలీసు స్టేషన్ల మధ్య సిబ్బంది సమన్వయంతో నైట్ బీట్స్ చేసేలా ఏఎస్పీకి ఆదేశాలిచ్చినట్టు తెలిపారు. జిల్లా సరిహద్దుల్లో పోలీసు పర్యవేక్షణ పటిష్టం చేశామని, ఈ ప్రదేశాల్లో ఆకస్మిక వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. గంజాయి రవాణాను అరికట్టేందుకు జిల్లాలో 4 శాశ్వత చెక్ పోస్టులను ఏర్పాటు చేయడంతో పాటు 11 డైనమిక్ వాహన తనిఖీ చెక్‌పోస్టులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో గంజాయి సాగు నివారణపై తీసుకున్న చర్యలు ఫలించాయని, గిరిజనులకు ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తున్నామన్నారు. ఏపీలో గంజాయి సాగు తగ్గుముఖం పట్టగా ఇతర ప్రాంతాల నుంచి రాకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్టు తెలిపారు. సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండేలా అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్టు తెలిపారు. సైబర్ నేరాలకు గురైన వారు ఫిర్యాదు చేసిన వెంటనే అకౌంట్ ఫ్రీజ్ చేయడం, బ్యాంకర్ల ద్వారా సాంకేతికత ఉపయోగించి నేరగాళ్లను పట్టుకునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఎస్పీ వెంట ఏఎస్పీ అధిరాజ్‌సింగ్‌రాణా, సీఐ అప్పన్న, ఎస్ఐ నారాయణరావు ఉన్నారు.



కేసుల పురోగతిపై సమీక్షిస్తున్న ఎస్పీ మురళీకృష్ణ

సారాకు మేం దూరం



ముకుందరాజుపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ విభీషణ్‌రావు

- సంపూర్ణ మద్య నిషేధానికి తీర్మానం
- ముకుందరాజుపేట గ్రామస్తుల నిర్ణయం

నక్కపల్లి: మండలంలో ముకుందరాజుపేట గ్రామంలో సంపూర్ణ మద్యపాన నిషేధానికి గ్రామస్తులు తీర్మానం చేశారు. మంగళవారం ఎస్ఐ విభీషణ్‌రావు, ఎక్సైజ్ ఎస్ఐ రమేష్‌ల సమక్షంలో పంచాయతీ వారు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో సారా తయారీ, మద్యం విక్రయాలు, మద్యపానం వంటి కార్యకలాపాలు పూర్తిగా నిషేధించాలని సమావేశంలో తీర్మానం చేస్తున్నట్టు సర్పంచ్ వియ్యపు శ్రీనివాస్ ప్రతిపాదన తెచ్చారు. దీనికి గ్రామపెద్దలు, గ్రామస్తులు ఆమోదం తెలిపారు. ఈ సమావేశంలో పాల్గొన్న నక్కపల్లి ఎస్ఐ విభీషణ్‌రావు మాట్లాడుతూ ముకుందరాజుపేట గ్రామస్తులు సంపూర్ణ మద్యపాన నిషేధాన్ని అమలు చేయాలని నిర్ణయం తీసుకోవడం అభినందనీయమని అన్నారు. ఇతర గ్రామాలు కూడా ముకుందరాజుపేటను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సారా తయారీ, మద్యం విక్రయాలు చట్టరీత్యా నేరమన్నారు. మద్యపానాన్ని త్యజించడం వల్ల జీవితాలు బాగుపడతాయన్నారు. పాయకరావుపేట ఎక్సైజ్ ఎస్ఐ రమేష్ మాట్లాడుతూ సారా తయారీ అనేది తీవ్రమైన నేరమన్నారు. సారా తయారీ విక్రయదార్లపై పీడీ యాక్ట్ కేసు నమోదు చేస్తున్నామన్నారు. సారా తయారీదారుల సమాచారాన్ని ఇస్తే అరికట్టేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఫిర్యాదు చేయాల్సిన టోల్‌ఫ్రీ నంబరును గ్రామస్తులకు తెలియజేశారు. బెల్టుషాపుల వివరాలను కూడా నిర్భయంగా తెలియజేయవచ్చన్నారు. ప్రతి గ్రామంలో ఇటువంటి సమావేశాలు ఏర్పాటు చేసి మద్యపానానికి, సారా తయారీకి వ్యతిరేకంగా అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు.

ఆర్టీసీ అధికారులకు ప్రశంసాపత్రాలు






ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు నుంచి ప్రశంసాపత్రం అందుకుంటున్న ప్రజారవాణా శాఖ అనకాపల్లి జిల్లా అధికారి కె.పద్మావతి, నర్సీపట్నం డిపో మేనేజర్ ధీరజ్

అనకాపల్లి టౌన్/నర్సీపట్నం: దసరా పండగ సందర్భంగా ప్రత్యేక సర్వీసులు నడిపి అధిక ఆదాయం లభించేందుకు దోహదపడిన ప్రజారవాణా శాఖ అధికారులకు ప్రశంసాపత్రాలు అందించారు. ఆర్టీసీకి అత్యధిక ఆదాయం సమకూర్చడంతోపాటు 102 శాతం ఓఆర్ సాధించినందుకు ఆ శాఖ జిల్లా అధికారి కె.పద్మావతి, నర్సీపట్నం ఆర్టీసీ డీఎం ఎం.ఎస్.ఎస్.ధీరజ్‌లను ఏపీఎస్ ఆర్టీసీ వైస్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ ద్వారకా తిరుమలరావు అమరావతి శాఖ కార్యాలయంలో మంగళవారం అభినందించారు. శరన్నవ రాత్రి ఉత్సవాల్లో అనకాపల్లి, నర్సీపట్నం డిపోల ద్వారా 101 బస్ సర్వీసులు నడిపి ఆర్టీసీకి రూ.52,77,000 ఆదాయం సాధించినందుకు విజయనగరం జోన్ నుంచి వీరిద్దరికీ ప్రశంసాపత్రంతోపాటు నగదు బహుమతి అందజేశారు.

సింహగిరికి మరో ఘాట్ రోడ్

- భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రెండు ప్రత్యామ్నాయాలతో ప్రతిపాదనలు
- సంబంధిత అధికారులతో చర్చించిన కలెక్టర్, జీవీఎంసీ కమిషనర్





ప్రతిపాదిత ఘాట్ రోడ్డు నిర్మాణ మ్యాప్

దొండపర్తి (విశాఖ): అప్పన్న భక్తులకు శుభవార్త. సింహాచలం పైకి మరో ఘాట్ రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. భవిష్యత్తు అవసరాల దృష్ట్యా రాకపోకలకు ప్రత్యేక మార్గాలను ఏర్పాటు చేయాలని అధికారులు నిర్ణయించారు. ఇప్పటికే రెండు ఘాట్లు అందుబాటులో ఉండగా మరో ఘాట్ రోడ్డు ఏర్పాటుకు సాధ్యాసాధ్యాలపై అధికారులు కసరత్తు పూర్తిచేశారు. సింహాచలం దేవస్థానం పై నుంచి కిందకు దిగేందుకు వీలుగా మరో ఘాట్ రోడ్డును నిర్మించేందుకు యంత్రాంగం చర్యలకు ఉపక్రమించింది. పర్వదినాల్లో భక్తుల రాకపోకలు, వాహనాల రద్దీని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని ఘాట్ రోడ్డు వేసేందుకు సింహాచలం దేవస్థానం అధికారులు రెండు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. అలాగే తొలి పావంచా నుంచి కొండపైకి ప్రస్తుతం ఉన్న రహదారిని దశావతారం జంక్షన్ నుంచి 2.5 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు ప్రణాళికలు రూపొందించారు. ఈ మేరకు వాటి సాధ్యాసాధ్యాలపై వివిధ విభాగాల అధికారులతో కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున, జీవీఎంసీ కమిషనర్ సీఎం సాయికాంత్ వర్మ మంగళవారం వీఎంఆర్డీఏ సమావేశ మందిరంలో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం ఉన్న రహదారుల సామర్థ్యం, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని తీసుకోబోయే చర్యలపై సుదీర్ఘంగా చర్చించారు. ఆర్అండ్‌బీ, పోలీస్, దేవస్థానం, ఇంజనీరింగ్ విభాగాల అధికారులు పాల్గొని వారి సలహాలు, సూచనలు అందజేశారు. భవిష్యత్తు అవసరాలను, ప్రధానంగా గిరి ప్రదక్షిణ, చందనోత్సవం వంటి పర్వదినాల్లో భక్తులు, వాహనాల రద్దీని పరిగణనలోకి తీసుకొని చర్యలు తీసుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు.

మౌలిక వసతుల కల్పనపై దృష్టి

దేవస్థానం ప్రతిపాదించిన ప్రత్యామ్నాయాల్లో అనుకూలమైన మార్గాన్ని చూపేందుకు, అధ్యయనం చేసేందుకు దేవస్థానం, పోలీసు, ఇంజనీరింగ్, ఆర్ అండ్ బీ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులతో కూడిన కమిటీని నియమిస్తామని కలెక్టర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. కమిటీ అధ్యయనం తర్వాత అనుకూలమైన మార్గంలో రహదారిని నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. అదనపు రహదారిని ఏర్పాటు చేయటంతో పాటు సింహాచలం దేవస్థానంపై మౌలిక వసతులను కూడా కల్పించాలని చెప్పారు. 25 నుంచి 30 సంవత్సరాల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక చర్యలు తీసుకోవాలని దేవస్థానం అధికారులను ఆదేశించారు. కొత్తగా నిర్మించబోయే రహదారికి ఆనుకొని కొండపై 5 ఎకరాల విస్తీర్ణంలో పార్కింగ్ సదుపాయం ఏర్పాటు చేయాలని సూచించారు. భక్తులు కొండపై బస చేసేందుకు అనువుగా అదనపు వసతి గృహాలు నిర్మించాలని, కాటేజీలను అందుబాటులోకి తీసుకురావాలని చెప్పారు. పబ్లిక్, ప్రైవేట్ పార్టనర్ షిప్ విధానంలో దేవస్థానం అవసరాలను తీర్చేలా సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. కొండపై ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించాలని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ఈవోను ఆదేశించారు. సుప్రభాత సేవ, ఆరాధన సమయంలో భక్తులు వచ్చేలా ఏర్పాట్లు చేయాలని, అన్ని రకాల సౌకర్యాలతో కూడిన సత్రాలను నిర్మించాలన్నారు. ఈ సమావేశంలో సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి, ఈఈ శ్రీనివాస రాజు, డీసీపీ ఆనంద్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రహదారి నిర్మాణానికి ప్రతిపాదనలు ఇలా..

సింహాచలం దేవస్థానం కొండ నుంచి కిందకు దిగేందుకు రెండు ప్రత్యామ్నాయాలను చూపుతూ అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేశారు.

- కొండపై ఉన్న టీవీ టవర్ నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డులో పాత గోశాల వైపు దిగేలా 6 కిలోమీటర్ల మేర ఒక రోడ్డును ప్రతిపాదించారు.
- కొండ పై భాగంలోని ఎత్తు రోడ్డు నుంచి 4.5 కిలోమీటర్ల మేర బీఆర్‌టీఎస్ రహదారిలో దిగేలా కృష్ణాపురం గోశాల(సూర్యనారాయణ దేవాలయం) వైపు మరో రహదారిని దేవస్థానం అధికారులు సూచించారు.
- తొలిపావంచా నుంచి ప్రస్తుతం ఉన్న రహదారిని దశావతారం జంక్షన్ నుంచి పైవరకు 2.5 కిలోమీటర్ల మేర విస్తరించేందుకు ప్రతిపాదన చేశారు.

టీ-20కి సర్వం సిద్ధం

కలెక్టర్ మల్లికార్జున

విశాఖ స్పోర్ట్స్: టీ-20 సిరీస్‌లో భాగంగా భారత్‌తో ఆస్ట్రేలియా తలపడే తొలి మ్యాచ్‌కు విశాఖలోని వైఎస్సార్ ఏసీఏ వీడీసీఏ స్టేడియం సిద్ధమైంది. గురువారం రాత్రి 7 గంటలకు మ్యాచ్ ప్రారంభం కానుంది. ఈ సందర్భంగా స్టేడియంలో మంగళవారం నిర్వాహక కమిటీ సమావేశమైంది. కమిటీ అధ్యక్షుడు, కలెక్టర్ ఎ.మల్లికార్జున మాట్లాడుతూ మ్యాచ్ నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు చెప్పారు. జిల్లా యంత్రాంగం సమన్వయంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా అవసరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. నగర పోలీస్ కమిషనర్ రవిశంకర్ మాట్లాడుతూ ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా మళ్లింపు కోసం డీఎస్పీ స్థాయి అధికారులను నియమించామన్నారు. ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ కార్యదర్శి ఎస్ఆర్ గోపీనాథ్‌రెడ్డి మాట్లాడుతూ స్టేడియంను సుందరంగా తీర్చిదిద్దామన్నారు. స్టేడియంలో కొన్ని గ్యాలరీల్లో కుర్చీలను మార్పు చేసి అభిమానులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా ఏర్పాట్లు చేశామన్నారు. కార్పొరేట్ గ్యాలరీని మరింత ఆకర్షణీయంగా తీర్చిదిద్ది.. ప్రత్యేక మార్గాన్ని ఏర్పాటు చేశామన్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ మాట్లాడుతూ స్టేడియంలో పారిశుధ్యం నిర్వహణ, ఫుడ్‌స్టాళ్లు, మంచినీటి సౌకర్యం కల్పించామన్నారు. డాక్టర్ సుధాకర్ మాట్లాడుతూ ఆరు అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచామన్నారు. మ్యాచ్ నిర్వాహక కమిటీ, వీడీసీఏ ప్రతినిధులతో పాటు సీఈవో శివారెడ్డి పాల్గొన్నారు.



మ్యాచ్ నిర్వహణ ఏర్పాట్లను వివరిస్తున్న టోర్నీ కమిటీ అధ్యక్షుడు మల్లికార్జున

నెట్స్‌లో చెమటోడ్చారు

విశాఖ స్పోర్ట్స్: టీ-20 సిరీస్‌లో భాగంగా విశాఖ వేదికగా తొలి మ్యాచ్ ఆడనున్న భారత్, ఆస్ట్రేలియా జట్లు మంగళవారం వైఎస్సార్ స్టేడియంలో సాధన చేశాయి. మధ్యాహ్నం ఒంటి గంట నుంచి నాలుగు వరకు భారత్ జట్టు.. ఐదు నుంచి ఎనిమిది గంటల వరకు ఫ్లడ్‌లైట్ల వెలుతురులో ఆస్ట్రేలియా జట్టు ప్రాక్టీస్ చేసింది. గురువారం రాత్రి ఏడు గంటలకు మ్యాచ్ ప్రారంభం కానున్న నేపథ్యంలో అందుకు తగ్గట్టుగానే మాథ్యూ వేడ్ సారథ్యంలో ఆ జట్టు శ్రమించింది. ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్‌తో పాటు వరల్డ్‌కప్ ఆడిన మిచెల్ మార్ష్, జోస్ హేజెల్‌వుడ్, కామెరాన్ గ్రీన్, మిచెల్ స్టార్క్ విశ్రాంతి తీసుకోవడంతో.. వీరి ఆటను ప్రత్యక్షంగా చూడాలనుకున్న విశాఖ అభిమానులకు నిరాశే ఎదురైంది. అంతర్జాతీయ వేదికపై తొలిసారిగా ఆడేందుకు ఆస్ట్రేలియా ఆటగాళ్లు జాసన్, టిమ్, నాథన్, జాన్సన్, షార్ట్స్, స్టోయినిష్ ఇప్పటికే విశాఖ చేరుకుని ప్రాక్టీస్ చేశారు. విశాఖ పిచ్‌పై అనుభవం ఉన్న డేవిడ్ వార్నర్‌ను బోర్డ్ చివరి నిమిషంలో వెనక్కి పిలవడంతో మరోసారి అతని ఆటను అభిమానులు మిస్ అయ్యారు. అతని స్థానంలో ఆల్‌రౌండర్ హార్డీ రానున్నాడు. స్టీవ్ స్మిత్, వరల్డ్ కప్ ఫైనల్స్ సెంచరీ హీరో ట్రావిస్ హెడ్, గ్లెన్ మాక్స్‌వెల్, మార్కస్, జంపా, జోష్ చెమటోడ్చారు. ఇక భారత్ తరఫున ఆసియా కప్‌తో పాటు ఐర్లాండ్‌తో మ్యాచ్‌లాడిన ఆటగాళ్లే విశాఖలో ఆడనున్నారు. ఐర్లాండ్‌తో ఆడిన భారత్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన బుమ్రాకు విశ్రాంతినిచ్చి.. సూర్యకుమార్ యాదవ్‌కు జట్టు సారథ్య బాధ్యతలు అప్పగించారు.



వార్మప్ చేస్తున్న ఆస్ట్రేలియా ఆటగాళ్లు



పిచ్‌ను పరిశీలిస్తున్న కోచ్ లక్ష్మణ్

క్లుప్తంగా

కరాటేలో మోడల్ స్కూల్ విద్యార్థుల సత్తా



క్రీడాకారులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సంధ్య

నర్సీపట్నం: జాతీయ స్థాయి కరాటే పోటీల్లో నర్సీపట్నం మండలం, వేములపూడి మోడల్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఈ నెల 19న తెలంగాణ రాష్ట్రం, మల్కాజిగిరిలో జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో ఆరో తరగతి చదువుతున్న ఆర్.హేమంత్, వై.అనన్య అద్భుత ప్రతిభ కనబరిచి గోల్డ్, సిల్వర్ మెడల్స్ సాధించారు. వీరిని మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సంధ్య, ఉపాధ్యాయులు అభినందించారు.

వీఆర్ఏల సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోవరాజు

ఎస్.రాయవరం: వీఆర్ఏల సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎస్.రాయవరం మండలం పి.ధర్మవరం వీఆర్ఏ లోవరాజు ఎన్నికయ్యారు. సోమవారం విజయవాడలో జరిగిన కార్యక్రమంలో సభ్యులు నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి వారి సమస్యలపై వినతిపత్రం సమర్పించారు.

వెదురువాడ వద్ద గుర్తు తెలియని మృతదేహం

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ మారుతీ వే బ్రిడ్జి వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని సోమవారం కనుగొన్నట్లు అచ్యుతాపురం పోలీసులు మంగళవారం తెలిపారు. మృతుని వయస్సు 35 సంవత్సరాలు ఉండవచ్చన్నారు. మృతుని ఎడమ చేతి మీద సంజయ్ అని ఇంగ్లిష్ అక్షరాలు, కుడిచేతి మీద ఒములు అని టాటూలు ఉన్నట్లు పేర్కొన్నారు. తుప్పల్లో పడివున్న మృతదేహం విషయమై వీఆర్వో ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

నష్టపోయిన వారిని ఆదుకుంటాం..

- అధికార యంత్రాంగం స్పందన వల్ల ప్రమాద తీవ్రత తగ్గింది
- సీఎం మానవత దృక్పథంతో స్పందించారు
- వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి



ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాద సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి, మేయర్ హరివెంకటకుమారి, ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు తదితరులు

మహారాణిపేట: ప్రభుత్వం, అధికార యంత్రాంగం వెంటనే స్పందించడంతో ఫిషింగ్ హార్బర్‌లో ప్రమాద తీవ్రత తగ్గిందని వైఎస్సార్ సీపీ రీజనల్ కోఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి అన్నారు. ఫిషింగ్ హార్బర్‌లో అగ్ని ప్రమాదం జరిగిన ప్రాంతాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ పోర్టు, స్టీల్‌ప్లాంట్, పోలీసులు సకాలంలో స్పందించారని, లేకుంటే భారీ ప్రమాదం సంభవించేదన్నారు. అధికారులు మంటలను అదుపు చేయడానికి ఎంతో కృషి చేశారని, దీని వల్ల ప్రాణ నష్టం జరగలేదన్నారు. మత్స్యకారుల పట్ల సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి మానవత దృక్పథంతో స్పందించారన్నారు. బాధితులకు 80 శాతం పరిహారం అందించాలని ఆదేశించారన్నారు. గతంలో మాదిరిగా ఆలస్యం కాకుండా రోజుల వ్యవధిలో పరిహారం ఇస్తామన్నారు. మునిగిపోయిన బోట్లను తొలగించాలని పోర్టు అధికారులను కోరారు. మత్స్యకారుల సమస్యలు, కష్టాలను తెలుసుకోవాలని సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి తనను ఇక్కడకు పంపారని తెలిపారు. కేవలం పరిహారం మాత్రమే కాదు, ఇతర సమస్యలు తెలుసుకొని పరిష్కరించడానికి కృషి చేస్తానన్నారు. ఇప్పుడు కొంత మంది అనుమానితులను అదుపులోకి తీసుకున్నారని, విచారణ జరుగుతోందన్నారు. సీసీ కెమెరాలు ఎందుకు పనిచేయలేదన్న విషయంపై విచారణ చేపట్టాలని సీపీని కోరారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం సందర్భంగా వై.వి.సుబ్బారెడ్డికి టోపీ, వల వైఎస్సార్ సీపీ నాయకుడు బర్రి కొండబాబు అందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్, మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు కోలా గురువులు, వైఎస్సార్ సీపీ అధికార ప్రతినిధి కొండా రాజీవ్ గాంధీ, ఉత్తర సమన్వయకర్త కె.కె.రాజు, ఏపీ మత్స్యకార కార్పొరేషన్ చైర్మన్ పేర్ల విజయచందర్, ఏపీ క్రిస్టియన్ మైనార్టీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ జాన్ వెస్లీ, ఏపీ మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్, వైఎస్సార్ సీపీ నాయకులు ద్రోణంరాజు శ్రీవత్సవ్, కార్పొరేటర్లు చెన్నా జానకీరామ్, వి.భాస్కరరావు, మత్స్యకార సంఘాల నాయకులు ఎ.దాసు, బర్రి కొండబాబు పాల్గొన్నారు.

తేరుకున్న హార్బర్



ఎగుమతుల కోసం సిద్ధం చేస్తున్న ప్యాకింగ్ బాక్సులు

మహారాణిపేట: ఫిషింగ్ హార్బర్ తేరుకుంది. ఆదివారం ఘోర అగ్ని ప్రమాదంలో భారీ స్థాయిలో ఆస్తి నష్టం సంభవించడంతో మత్స్యకారులంతా తీవ్ర ఆవేదనలో మునిగిపోయారు. సోమవారమంతా హార్బర్‌లో ఎటువంటి కార్యకలాపాలు జరగలేదు. మంగళవారం నుంచి ఒక్కొక్కరూ గంగమ్మతల్లిపై భారం వేసి పనుల్లో నిమగ్నమయ్యారు. యథావిధిగా కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. తెప్పలు, కొన్ని బోట్లు వేటకు వెళ్లి మత్స్య సంపదతో తిరిగొచ్చాయి. కొన్ని బోట్లలో నిల్వ ఉంచిన మత్స్యసంపదను మంగళవారం వేలంవేశారు. యథావిధిగా చేపల క్రయవిక్రయాలు జరిగాయి. హార్బర్‌ను నమ్ముకుని ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష కుటుంబాలు ఆధారపడి జీవిస్తున్నాయి. బుధవారం రాత్రి నుంచి యథావిధిగా వేటకు వెళతామని రాష్ట్ర మరపడవల సంఘం అధ్యక్షుడు వాసుపల్లి జానకీరామ్ తెలిపారు.

హార్బర్ ఘటనపై ప్రత్యేక బృందం ఏర్పాటు

డాబాగార్డెన్స్ : ఫిషింగ్ హార్బర్ అగ్ని ప్రమాద ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు వేగవంతం చేశారు. కేసును ఛేదించేందుకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్ ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశారు. ఇప్పటికే పది మంది అనుమానితులను స్టేషన్‌కు తీసుకొచ్చి విచారిస్తున్నట్టు సమాచారం. యూట్యూబర్ లోకల్ బాయ్ నాని ఇప్పటికీ పోలీసుల అదుపులో విచారిస్తున్నారు. అలాగే ప్రమాద సమయంలో ఆ ప్రాంతంలో సెల్‌టవర్ పరిధిలో గల మొబైల్స్ సమాచారాన్ని కూడా పరిశీలిస్తున్నట్టు తెలిసిందే. దీని ప్రకారం నిందితులను గుర్తించే అవకాశం ఉందని పోలీసులు భావిస్తున్నారు. ఇప్పటివరకు అదుపులోకి తీసుకున్న వారి నుంచి సేకరించిన సమాచారం మేరకు మరి కొంత మందిపై నిఘా పెట్టినట్టు భోగట్టా. ప్రమాదవశాత్తు ఘటన జరిగినట్టు కేసు నమోదు చేసినప్పటికీ.. ఇందులో కుట్ర వ్యవహారం దాగి ఉందన్న కోణంలో కూడా పోలీసులు లోతుగా దర్యాప్తు చేస్తున్నారు.

బాలికల 'భువన విజయం'



భువన విజయం నిర్వహించిన విద్యార్థులతో ఉపాధ్యాయ బృందం

చోడవరం రూరల్: స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల మంగళవారం శ్రీకృష్ణదేవరాయల రాజ దర్బార్‌గా మారిపోయింది. బాలికలు అష్టదిగ్గజాలుగా మారి రాయల భువన విజయాన్ని కళ్ల ముందు నిలిపారు. 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాల ముగింపు సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వి.రామిరెడ్డి ఆధ్వర్యంలో తెలుగు భాష పండితులు ఎం.రాధ, జె.అనురాధ, కొటాన గోవిందల పర్యవేక్షణలో విద్యార్థులు కవి సమ్మేళనంలో పాల్గొని ప్రేక్షకులను మైమరపించారు. శ్రీకృష్ణదేవరాయలుగా వి.శ్రీలక్ష్మి, అల్లసాని పెద్దనగా ప్రహర్షిత, నంది తిమ్మనగా లక్ష్మీలహరి, మాదయగారి మల్లన(కందుకూరి రుద్రకవి)గా జ్యోత్స్న, అయ్యలరాజు రామభద్రుడిగా హర్షిత, పింగళి సూరనగా అమీరున్నీసా, రామరాజభూషణుడు(భట్టుమూర్తి)గా వర్షిని, తెనాలి రామకృష్ణగా మౌనికలు తమ పాత్రలలో జీవించారు. వారి అద్భుత నటన ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. వారి నటన, వాచకం సహచర విద్యార్థులకు తెలుగుభాష తియ్యందనాన్ని రుచి చూపి, మాతృభాష పట్ల మమకారాన్ని మరింత పెంచేలా చేసింది. ప్రదర్శనానంతరం ప్రేక్షకులు విద్యార్థులను ప్రశంసలతో ముంచెత్తారు. ఉపాధ్యాయులు జి.శ్రీవల్లి, సంధ్యారాణి, ఇతర ఉపాధ్యాయ సిబ్బంది భువన విజయాన్ని విజయవంతంగా నిర్వహించిన విద్యార్థులను అభినందించారు.

జాతీయ స్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు తనూజ



ఎంపికైన విద్యార్థినిని అభినందిస్తున్న నరసింహారావు

పాయకరావుపేట: శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థిని కర్రి తనూజ జాతీయ స్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే నరసింహారావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 18 వరకు గవర్నమెంట్ బి క్యాంపు హైస్కూల్, కర్నూల్‌లో జరిగిన రాష్ట్ర స్థాయి అండర్-19 బాలికల హ్యాండ్ బాల్ పోటీల్లో విశాఖ జిల్లా తరఫున ఆడిన తనూజ అత్యుత్తమ ప్రతిభ కనబరిచిందన్నారు. దీంతో డిసెంబర్ మొదటి వారంలో హర్యానాలోని సిరసాలో జరుగనున్న జాతీయ స్థాయి పోటీల్లో ఆంధ్రప్రదేశ్ జట్టు తరపున పాల్గొననుందన్నారు. ఈ సందర్భంగా తనూజ మాట్లాడుతూ వరుసగా రెండో ఏడాది కూడా జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం ఆనందంగా ఉందన్నారు. కళాశాల హ్యాండ్ బాల్ కోచ్ సురేష్ ఇస్తున్న కోచింగ్, తన సాధనే ఈ అవకాశానికి కారణమని తెలిపింది. తనూజను ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు అభినందించారు.

నదిలో మునిగి దుక్కిటెద్దుల మృతి



మృతి చెందిన దుక్కిటెద్దులు

చోడవరం రూరల్: మండలంలోని లక్కవరం వద్ద పెద్దేరు నదిలో మునిగి మంగళవారం రెండు దుక్కిటెద్దులు ఊపిరి ఆడక మృతి చెందాయి. గ్రామానికి చెందిన రైతు అద్దేపల్లి వెంకటరమణ తన రెండు ఎద్దులను కడగడానికి శారదానదిలోకి దించాడు. అయితే ఎద్దులు నదిలోని ఇసుకలో కూరుకుపోవడంతో ఈదడానికి వీల్లేకపోయింది. దీంతో నీటి మునిగి చనిపోయినట్లు గ్రామస్తులు తెలిపారు. ఫ్యాక్టరీ సీజన్ మొదలు కానున్న నేపథ్యంలో దుక్కిటెద్దులు మృతి చెందడంతో రైతుకు తీరని నష్టం వాటిల్లింది. రైతు కుటుంబ సభ్యులు ఎద్దుల మృతదేహాల వద్ద కన్నీరుమున్నీరుగా విలపించడం స్థానికుల్ని కలచివేసింది. వీటి విలువ సుమారు రూ.1.50 లక్షల వరకు ఉంటుందని అంచనా. రైతును ఆదుకోవాలని సహచర రైతులు కోరుతున్నారు. మృతి చెందిన ఎడ్లను స్థానిక పశువైద్య సిబ్బందికి చూపించి, అనంతరం ఖననం చేశారు.

రైతులకు సాగు నీటి కష్టాలు లేకుండా చేస్తాం

మంగళాపురం ఆనకట్ట శంకుస్థాపనలో ఎంపీ బీవీ సత్యవతి, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ



ఆనకట్ట పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎంపీ సత్యవతి, విప్ ధర్మశ్రీ



రైతులతో కలిసి దెబ్బతిన్న ఆనకట్టను పరిశీలిస్తున్న ఎంపీ, విప్, రైతు సంఘ నాయకులు

బుచ్చెయ్యపేట: రైతులకు సాగు నీటి కష్టాలు లేకుండా, పంటలకు పుష్కలంగా సాగునీరు అందేలా చేస్తామని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ, ఎంపీ బీవీ సత్యవతిలు తెలిపారు. రూ.40 లక్షలతో నిర్మించనున్న మంగళాపురం ఆనకట్ట నిర్మాణ పనులకు మంగళవారం శంకుస్థాపన చేశారు. మంగళాపురం, కుముదాంపేట, విజయరామరాజుపేట, లక్ష్మీపురం, సురవరం తదితర గ్రామాలకు చెందిన 4,400 ఎకరాలకు కోనాం రిజర్వాయర్ సాగునీరు అందేది. కోనాం రిజర్వాయర్ నుంచి వచ్చే సాగు నీటి కాలువ రెండేళ్ల కిందట కురిసిన భారీ వర్షాలకు దెబ్బతింది. నీటి ఉధృతికి మంగళాపురం ఆనకట్ట వద్ద పొంగి ప్రవహించింది. ఈ ప్రవాహానికి ఆనకట్ట దెబ్బతింది. దీంతో రెండేళ్లుగా ఆయకట్టు రైతులకు సాగు నీరు అందక, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. స్థానిక నాయకులు సాగునీరు అందించి ఆదుకోవాలని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీని కోరారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఈ ఆనకట్టను నిర్మించి, సాగు నీరు అందిస్తామని విప్ ధర్మశ్రీ రైతులకు హామీ ఇచ్చారు. ఆయన చొరవతో ఎంపీ బీవీ సత్యవతి తన ఎంపీ కోటా నుంచి ఆనకట్ట నిర్మాణానికి రూ.40 లక్షల నిధులు మంజూరు చేశారు. ఈ నేపథ్యంలో రైతు సంఘ నాయకులతో కలిసి ఆనకట్టకు శంకుస్థాపన చేసి, పనులు వేగవతంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు, అధికారులకు సూచించారు. వచ్చే ఖరీఫ్ నాటికి రైతులకు సాగునీటి కష్టాలు లేకుండా చేయాలని నీటిపారుదలశాఖ అధికారులను సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, జెడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, అఖిల గాండ్ల తెలుకుల సంఘం జిల్లా కార్యదర్శి చిత్రాడ జగదీష్, రాష్ట్ర స్పోర్ట్స్ డైరెక్టర్ జొన్నాడ శ్రీనివాస్, కోపరేటివ్ అధ్యక్షుడు ఎల్లపు గోవింద, సర్పంచ్‌లు కంటే పద్మరేఖ వెంకట్, విజయ్‌కుమార్, ఎంపీటీసీ పత్తి అప్పలనరస, రైతు సంఘ నాయకులు జగ్గు, సయ్యపురెడ్డి ఆనంద్, ఆదినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైలు ప్రయాణంలో వృద్ధులకు రాయితీలివ్వాలి



మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు నారాయణమూర్తి

అనకాపల్లిటౌన్: రైలు ప్రయాణ సమయంలో సీనియర్ సిటిజన్లకు రాయితీ ఇచ్చేలా దేశ వ్యాప్తంగా ఎంపీలు, ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని రాష్ట్ర సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు నారాయణమూర్తి కోరారు. స్థానిక జార్జి క్లబ్ ఆవరణలో మంగళవారం అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో ట్రిబ్యునల్ కమిటీలను ఏర్పాటు చేస్తామన్నారు. వయోవృద్ధులపై వేధింపులు నివారణకు ప్రభుత్వాలు కృషి చేయాలన్నారు. వయో వృద్ధుల చట్టం-2019ను పార్లమెంట్‌లో ఆమోదించాలని కోరారు. బ్యాంకులో వృద్ధులకు ప్రత్యేక క్యూ లైన్ వ్యవస్థను తప్పనిసరి చేయాలన్నారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామచంద్రరావు మాట్లాడుతూ సెంట్రల్ కమిటీ సభ్యులు అసోసియేషన్‌కు ప్రతి ఏడాది చందా చెల్లించాలని కోరారు. జిల్లా స్థాయిలో సభ్యత్వం పెంపునకు కృషి చేయాలన్నారు. అనంతరం ఈ ఏడాది బడ్జెట్‌ను సంఘ రాష్ట్ర కోశాధికారి మదనమోహన్‌రావు వివరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కేవీ గౌరీపతి, కార్యదర్శి బీఎల్ఎన్ శాస్త్రి, కోశాధికారి వి.సత్యనారాయణ, ఉపాధ్యక్షుడు డాక్టర్ ఎంబీవీ స్వామి, సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు కొండా నిర్మల, రాష్ట్ర నాయకులు ఎస్.సూర్యనారాయణ, వీరరావ్, వెంకటేశ్వరరావు, నల్లల దేముళ్లు, కేఎం నాయుడు, పి.బాబురావు తదితరులు పాల్గొన్నారు.

భారీ బందోబస్తు

- 2 వేల మంది పోలీసులతో పటిష్ట భద్రతా చర్యలు
- ఆటగాళ్ల బస, ప్రయాణించే ప్రాంతాల్లో నిరంతరం తనిఖీలు
- ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు

దొండపర్తి: భారత్-ఆస్ట్రేలియా క్రికెట్ జట్ల మధ్య ఈ నెల 23న వైఎస్సార్ స్టేడియంలో జరిగే టీ-20 మ్యాచ్‌కు భారీ బందోబస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ ఆదేశాల మేరకు రెండు వేల మందితో పటిష్ట భద్రత చర్యలు చేపడుతున్నారు. ఎయిర్‌పోర్టు నుంచి క్రీడాకారులు బయలుదేరే ప్రాంతాల్లోనే కాకుండా.. వారు బస చేసే హోటళ్ల వద్ద తనిఖీలు నిర్వహిస్తున్నారు. స్టేడియం చుట్టూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. స్టేడియంలోకి వెళ్లే అన్ని గేట్ల వద్ద ఏసీపీ స్థాయి అధికారులను నియమించారు. స్టేడియం వద్ద మూడంచెల భద్రతతో పలు సెక్టార్లుగా విభజించారు. స్టేడియం లోపల, బయట, చుట్టూ ఉన్న బహుళ అంతస్తులపైనా పూర్తి భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. మ్యాచ్ సందర్భంగా ఎక్కడా ట్రాఫిక్ నిలిచిపోకుండా ప్రణాళికలు సిద్ధం చేశారు.

పోలీసుల సూచనలివీ..

- అనేక ప్రత్యేకతలతో టికెట్ డిజైన్ చేశారు. లెవల్-1లో టికెట్‌ను హాఫ్ ఇంచ్ చింపితే ఆకుపచ్చ రంగు కనిపిస్తుంది. టికెట్‌ను సమాంతరంగా పెట్టి చూస్తే గోల్డ్ కలర్ సెక్యూరిటీ థ్రెడ్ కనిపిస్తుంది. టికెట్‌పై బార్ కోడ్ స్కాన్ చేస్తే మ్యూజిక్ వస్తుంది. అలా ఉంటేనే ఒరిజినల్ టికెట్‌గా పరిగణిస్తారు.
- కొంతమంది కలర్ జిరాక్స్ తీసిన టికెట్లను అమ్మి మోసగిస్తారు. అటువంటి గుర్తు తెలియని వ్యక్తుల వద్ద కలర్ జిరాక్స్ టికెట్లను కొని మోసపోవద్దు.
- బయట నుంచి ఆహార పదార్థాలు, వాటర్ బాటిళ్లను అనుమతించరు. స్టేడియంలోనే ఇవి అందుబాటులో ఉంటాయి.
- స్టేడియం మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలో ఉంటుంది. ప్రేక్షకులు ఎటువంటి చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడినా.. పరిధి దాటి ఆటగాళ్లతో సెల్ఫీలు తీసుకున్నా.. ప్రయత్నించినా కఠిన చర్యలు తప్పవు.
- సాయంత్రం 7 నుంచి రాత్రి 11 వరకు క్రికెట్ మ్యాచ్ ఉంటుంది. ప్రేక్షకులను సాయంత్రం 4 లేదా 5 గంటల నుంచి స్టేడియంలోకి అనుమతిస్తారు.

ట్రాఫిక్, పార్కింగ్‌కు ప్రత్యేక ఏర్పాట్లు

టీ-20 మ్యాచ్ సందర్భంగా స్టేడియానికి 28 వేల మంది వచ్చే అవకాశముంది. వేల సంఖ్యలో వాహనాలపై వారు వచ్చే అవకాశం ఉండటంతో.. అందుకు తగ్గట్టుగా పోలీసులు ట్రాఫిక్, పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు.

- మ్యాచ్‌తో సంబంధం లేని వాహనచోదకులు క్రికెట్ స్టేడియం వైపు నుంచి కాకుండా.. ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా వెళ్లాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం నుంచి నగరంలోకి వచ్చే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు మారికవలస వద్ద ఎడమ వైపునకు తిరిగి.. జురాంగ్ జంక్షన్ మీదుగా తిమ్మాపురం చేరుకోవాలి. కుడి వైపున బీచ్ రోడ్డులో ప్రయాణించి రుషికొండ, సాగర్ నగర్, జోడుగుళ్లపాలెం మీదుగా వెళ్లాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు వంటివి కార్ షెడ్ నుంచి మిథిలాపురి కాలనీ మీదుగా.. ఎంవీపీ సిటీ వెనుకగా వెళ్లాలి. అక్కడి నుంచి లా కాలేజ్ రోడ్డు మీదుగా ఎన్‌హెచ్ 16కు చేరుకుని నగరానికి చేరుకోవాలి. లా కాలేజీ రోడ్డు నుంచి పనోరమ హిల్స్, రుషికొండ మీదుగా కూడా నగరంలోకి వెళ్లవచ్చు.
- నగరం నుంచి ఆనందపురం, విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే బస్సులు, ఇతర కమర్షియల్ వాహనాలు, హనుమంతవాక నుంచి ఎడమ వైపు తిరిగి.. ఆరిలోవ బీఆర్‌టీఎస్ రోడ్డులో వెళ్లి అడివివరం వద్ద కుడి వైపు తిరిగి ఆనందపురం మీదుగా వెళ్లాలి.
- నగరం నుంచి ఆనందపురం, విజయనగరం శ్రీకాకుళం వైపు వెళ్లే కార్లు, ద్విచక్ర వాహనాలు, ఆటోలు హనుమంతవాక జంక్షన్ నుంచి ఎడమ వైపు తిరిగి.. అడివివరం మీదుగా ఆనందపురం వెళ్లొచ్చు. లేదా హనుమంతవాక జంక్షన్ లేదా విశాఖ వ్యాలీ జంక్షన్ లేదా ఎండాడ జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి బీచ్ రోడ్డుకు చేరుకుని.. తిమ్మాపురం వద్ద ఎడమ వైపు తిరిగి మారికవలస వద్ద ఎన్‌హెచ్ 16కు చేరుకోవచ్చు.

మ్యాచ్ వీక్షించడానికి వచ్చే వాహనచోదకులకు సూచనలు

- నగరం నుంచి స్టేడియానికి వచ్చే వీవీఐపీ, వీఐపీ వాహనచోదకులు ఎన్‌హెచ్16లో స్టేడియం వరకు ప్రయాణించి.. ఏ గ్రౌండ్, బీ గ్రౌండ్, వి కన్వెన్షన్ గ్రౌండ్‌లలో వారి వారి పాస్‌ల ప్రకారం చేరుకోవాలి.
- విశాఖ వైపు నుంచి స్టేడియానికి వచ్చే టికెట్ ఉన్న వారు ఎన్‌హెచ్16లో ప్రయాణించి.. స్టేడియం సమీపంలోని ఓల్డేజ్ జంక్షన్ వద్ద ఎడమ వైపు తిరిగి సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో పార్కింగ్ చేసుకోవాలి. సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ గ్రౌండ్‌లో ఆన్‌లైన్ టికెట్లను ఒరిజినల్ టికెట్లుగా మార్చుకునేందుకు కౌంటర్లు ఏర్పాటు చేశారు.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం, గంభీరం, బోయపాలెం, కొమ్మాది వైపు నుంచి వచ్చే వారు కార్‌షెడ్ జంక్షన్ వద్ద కుడి వైపు తిరిగి సాంకేతిక ఇంజినీరింగ్ కాలేజీ పార్కింగ్ గ్రౌండ్‌కు చేరుకోవాలి. లేదా కార్ షెడ్ జంక్షన్ నుంచి ఎడమ వైపు తిరిగి మిథిలాపురి కాలనీ మీదుగా వచ్చి, ఎంవీపీ సిటీ డబుల్ రోడ్డు, పోలిశెట్టి వేణు గోపాలరావు గ్రౌండ్‌లలో పార్కింగ్ చేసుకోవాలి.
- నగరం నుంచి లేదా భీమిలి వైపు నుంచి బీచ్ రోడ్డు మీదుగా స్టేడియానికి వచ్చే వారు.. ఐటీ సెజ్ మీదుగా మీదుగా వచ్చి ఎంవీపీ సిటీ డబుల్ రోడ్డులో వాహనాలు నిలపాలి.
- నగరం నుంచి వచ్చే ఆర్టీసీ స్పెషల్ బస్సులు ఎన్‌హెచ్-16లో రాకుండా బీచ్‌రోడ్డులో వచ్చి ఐటీ సెజ్ మీదుగా లా కాలేజీ రోడ్డులో పార్కింగ్ చేసుకోవాలి.
- శ్రీకాకుళం, విజయనగరం, ఆనందపురం వైపు నుంచి వచ్చే ఆర్టీసీ స్పెషల్ బస్సులు మారికవలస, తిమ్మాపురం, ఐటీ సెజ్ మీదుగా లా కాలేజీ రోడ్డుకు చేరుకుని వాహనాలను పార్కింగ్ చేసుకోవాలి.

భారీ వాహనదారులకు సూచనలు

- 23వ తేదీ ఉదయం 6 గంటల నుంచి రాత్రి 12 వరకు ఎటువంటి భారీ వాహనాలు స్టేడియం వైపు అనుమతించరు.
- అనకాపల్లి నుంచి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే వాహనాలు నగరంలోకి రాకుండా సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా వెళ్లాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి అనకాపల్లి వెళ్లే వాహనాలు ఆనందపురం నుంచి పెందుర్తి మీదుగా అనకాపల్లి వైపు వెళ్లాలి.
- నగరం నుంచి బయలుదేరి విజయనగరం, శ్రీకాకుళం వైపు వెళ్లే భారీ వాహనాలు అన్నీ అనకాపల్లి వైపుగా సబ్బవరం, పెందుర్తి, ఆనందపురం మీదుగా ప్రయాణించాలి.
- శ్రీకాకుళం, విజయనగరం వైపు నుంచి నగరంలోకి వచ్చే భారీ వాహనాలన్నీ ఆనందపురం నుంచి పెందుర్తి, సబ్బవరం, అనకాపల్లి మీదుగానే నగరంలోకి చేరుకోవాలి.

క్లుప్తంగా

నేడు 'వై ఏపీ నీడ్స్ జగన్'

అనకాపల్లిటౌన్: ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే.. కార్యక్రమం పట్టణంలోని గొల్లవీధి, మండలంలోని మామిడిపాలెం గ్రామంలలో బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబులు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. మధ్యాహ్నం 3 గంటలకు సచివాలయం పరిధిలో అర్హులైన లబ్ధిదారుల డిస్‌ప్లే బోర్డు, జెండా ఆవిష్కరణ, ఇంటింటికీ వెళ్లి టీడీపీ పాలన, ప్రస్తుత ప్రభుత్వ పాలన మధ్య వ్యత్యాసాలను వివరించి, సంక్షేమ పథకాల బ్రోచర్లను పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. రాత్రికి అక్కడే పల్లెనిద్ర చేసి, మరుసటి రోజు ప్రజల సమస్యలపై చర్చించనున్నట్లు తెలిపారు. సచివాలయం కన్వీనర్లు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు, ప్రజలు హాజరుకావాల్సిందిగా కోరారు.

సత్యసాయి మందిరానికి నగిషీలతో ముస్తాబు


కోమటి వీధిలో ముస్తాబు చేస్తున్న సత్యసాయిబాబా మందిరం

కశింకోట: స్థానిక కోమటి వీధిలో వెలసిన సత్య సాయిబాబా మందిరాన్ని నగిషీలతో అందంగా తీర్చిదిద్దుతున్నారు. మందిరంపై అంతస్తులో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడానికి గచ్చులు, సీలింగ్ వేసి, ఆలయ ముందు భాగాన్ని అందంగా సిద్ధం చేస్తున్నారు. బుధ, గురువారాల్లో ఆలయంలో బాబా జన్మదినోత్సవ నిర్వహణకు సన్నాహాలు చేస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

10న భాగవత బంధువుల వన సమారాధన

తుమ్మపాల: స్థానిక సుంకరమెట్ట సత్యనారాయణస్వామి, సూర్యనారాయణస్వామి ఆలయంలో డిసెంబర్ 10న భాగవత బంధువుల సంఘం ఆధ్వర్యంలో కార్తీక వన సమారాధన నిర్వహించనున్నట్లు సంఘ గౌరవాధ్యక్షుడు డాక్టర్ మంగవిల్లి జగన్మోహనరావు మంగళవారం తెలిపారు. ఈ మేరకు సంఘ కార్యాలయంలో వన సమారాధన పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంఘ సభ్యులు పాల్గొన్నారు.

8 మందికి ఐవోఎల్ శస్త్రచికిత్సలు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం 8 మందికి ఉచితంగా ఐవోఎల్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి చైర్మన్ రవిరామ్ జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 31 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఐదురోజులు ఆస్పత్రిలో వసతి, సరిపడా మందులు, ఆహారం ఉచితంగా అందిస్తామన్నారు. వైద్యుడు కె.మల్లేశ్వరరావు, సహాయకురాలు పి.దేవి పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 1,717 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,770	4,450
రెండో రకం	3,610	4,070
మూడోరకం	3,400	3,650

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 20 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-4 యూనిట్లు, బీ పాజిటివ్-5 యూనిట్లు, బీ నెగిటివ్-1యూనిట్, ఓ పాజిటివ్-5 యూనిట్లు, ఏబీ పాజిటివ్-5 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదింవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 483 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 448 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

కనుల ముంగిట కలల రహదారి



నా పేరు బొండా బాలు. ఆటో నడుపుతుంటా. ఎక్కువగా అనకాపల్లి-కూండ్రం రోడ్డుపై ఆటో తిప్పుతుంటా. కేబీ రోడ్డు గత పదేళ్లుగా చాలా అధ్వానం. గోతుల మూలంగా ఆటోలో కూర్చున్న వారు చాలా ఇబ్బందులు పడేవారు. ఆటో కూడా చాలాసార్లు రిపేర్లుకొచ్చింది. జగనన్న ప్రభుత్వం వచ్చాక రోడ్డు రూపురేఖలు పూర్తిగా మారిపోయాయి. గతంలో అనకాపల్లి నుంచి కూండ్రం వెళ్లాలంటే కనీసం 30-40 నిముషాలు పట్టేది. ఇపుడు కేవలం 10-15 నిముషాలు చాలు. మధ్యలో వచ్చే ప్రతి గ్రామంలోను విద్యుత్ లైట్లు వేశారు.

కొత్తూరు-బంగారుమెట్ట రహదారికి మోక్షం

రూ.32 కోట్లతో 24 కి.మీ. మేర రోడ్డు

ఆనందంలో 25 గ్రామాల ప్రజలు

కొత్తూరు-బంగారుమెట్టకు పక్కా రోడ్డు. దశాబ్దాలుగా తాత ముత్తాల మాదిరే.. తమ తరంలోనూ కలగానే మిగిలిపోతుందనుకున్నారు. వారి కలలకు అభివృద్ధి, సంక్షేమ ప్రదాత సీఎం జగన్ పాలనలో వాస్తవ రూపం లభించింది. పక్కా రోడ్డు నిర్మాణంతో 25 గ్రామాల ప్రజల ఆనందానికి అంతే లేకుండా పోయింది.



తుమ్మపాల: అనకాపల్లి-కశింకోట-బుచ్చయ్యపేట మండలాలను కలుపుతూ పాడేరు వెళ్లేందుకు ఈ రోడ్డే ప్రధాన రహదారి. ఈ ప్రాంతంలో క్వారీలు ఎక్కువ. క్వారీల నుంచి మెటీరియల్ తరలించే భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు గోతులమయంగా మారింది. గత పాలకులు మరమ్మతులతో మమ అనిపించారే తప్ప, నాలుగు కాలాల పాటు నిలిచేలా రోడ్డు నిర్మాణానికి ముందుకురాలేదు. దీంతో ఏళ్ల తరబడి భారీ గోతులతో ఉన్న ఈ రోడ్లో ప్రయాణం దుర్భరంగా ఉండేది.


నాడు: గోతులతో చెరువును తలపించేలా రోడ్డు

నెరవేరిన ఎన్నికల హామీ

గత ఎన్నికల ప్రచారంలో ప్రస్తుత మంత్రి గుడివాడ అమర్‌నాథ్ తనను గెలిపిస్తే ఈ ప్రాంత ప్రజల చిరకాల వాంఛ అయిన ఈ రోడ్డును నిర్మిస్తానని హామీ ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక దాదాపు రెండేళ్లు కరోనా కల్లోలం. ఆ ఉపద్రవం నుంచి కోలుకున్నాక రోడ్డు పునరుద్ధరణకు నడుంకట్టారు. మంత్రి చొరవతో రోడ్డు నిర్మాణం ప్రారంభమయింది. భారీ వాహనాల రాకపోకలను దృష్టిలో పెట్టుకుని పది కాలాల పాటు పటిష్టంగా, నాణ్యతతో రోడ్డును నిర్మించారు.

నాడు మరమ్మతులతో సరి

టీడీపీ ప్రభుత్వం మరమ్మతుల కోసం పలుమార్లు టెండర్లు పిలిచి సొమ్ము చేసుకున్నారన్న ఆరోపణలున్నాయి. నామమాత్రపు పనులతో ప్రతి సారీ రూ.లక్షల్లో దోచుకున్నారని స్థానికుల ఆక్షేపణ. నాణ్యతను పట్టించుకోకుండా చేపట్టిన పనులు కావడంతో కొన్ని రోజుల్లోనే గోతులమయంగా మారేవి. వర్షాలు కురిశాయంటే.. ప్యాచ్ వర్క్ కొట్టుకుపోయి, పాత రోడ్డే కనిపించేదని స్థానికులు చెప్తున్నారు. దీంతో విసిగిపోయిన స్థానిక ప్రజలు ఎన్నికల సమయంలో రోడ్డు అభివృద్ధిపై గట్టిగానే పట్టుబట్టారు. ఎన్నికల ముందు మంత్రి అమర్‌నాథ్ ఇచ్చిన హామీతో తాజాగా ఈ రోడ్డుకు మోక్షం దక్కింది.

డబుల్ లేయర్ రోడ్డు

ఈ రోడ్డు నిర్మాణంలో కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. రహదారిని ఆనుకుని అనేక గ్రామాలు ఉన్నాయి. కొన్ని ప్రధాన కూడళ్లను మరింత అభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డబుల్ లేయర్ మధ్యలో ఇనుప మెస్ ఏర్పాటుచేశారు. అత్యాధునిక టెక్నాలజీతో శాశ్వతంగా నిలిచిపోయేలా రోడ్డును నిర్మించారు. గ్రామాల జంక్షన్‌లలో చివరి వరకు సీసీ రోడ్డు చేపట్టి, అక్కడి నుంచి రెండు లేయర్లతో తారు రోడ్డును అభివృద్ధి చేశారు. రెండు లైన్లుగా వేస్తున్న ఈ రోడ్డు నాణ్యతకు ఆయా గ్రామాల ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


పటిష్టంగా నిర్మిస్తున్న డబుల్ లేయర్ రోడ్డు(ఫైల్) (ఇన్‌సెట్లో నిర్మాణం తర్వాత ప్రస్తుతం రోడ్డు)


నాడు: రోడ్డుపై గోతిలోపడి నిలిచిపోయిన లారీ

శరవేగంగా.. పటిష్టంగా..

అనకాపల్లి మండలం కొత్తూరు నుంచి ప్రారంభించిన ఈ రోడ్డు పనులు అత్యంత వేగంగా పూర్తిచేశారు. ముందుగా ఆయా గ్రామాల ప్రధాన కూడళ్లల్లో సీసీ రోడ్లను పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. మిగిలిన పనులు వేగంగా పూర్తి చేసి, నిరాటంకంగా రాకపోకలు సాగించేందుకు వీలుగా అధికారులు కార్యాచరణ చేశారు. గతంలో గంట నుంచి గంటన్నర పాటు జరిగే ప్రయాణం, ఇప్పుడు కేవలం 30 నిమిషాల్లోనే పూర్తవుతోందని స్థానికులు చెప్తున్నారు. రోడ్డు నిర్మాణ పనులను స్వయంగా పరిశీలించిన ప్రజలు, చాలా ఏళ్లు నిలిచిపోతుందన్న ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

24 కి.మీ., 25 గ్రామాలు, రూ.32 కోట్లు

అనకాపల్లి మండలం కొత్తూరు నుంచి బంగారుమెట్ట వరకు 24 కిలో మీటర్ల పొడవున ఈ రోడ్డు విస్తరించి ఉంది. దాదాపు 25 గ్రామాల ప్రజల దైనందిన రాకపోకలకు ఈ రోడ్డే ప్రధాన ఆధారం. మొన్నటి వరకు ఈ రోడ్డుపై ప్రయాణించాలంటే గంటకు 5-10 కి.మీ. మించి వేగంగా వెళ్లలేని పరిస్థితి. దీనికి తోడు తరచూ ప్రమాదాలే. కాళ్లు, చేతులు విరిగి ఇబ్బంది పడ్డవారెందరో..! దీంతో తాజాగా ప్రభుత్వం రూ.32 కోట్లు వెచ్చించి రోడ్డును పటిష్టంగా నిర్మించింది.


నేడు: పటిష్టంగా నిర్మించిన కొత్తూరు-బంగారుమెట్ట ప్రధాన రహదారి

గ్రామాల రూపురేఖలు మారాయి



సరైన రోడ్డు లేక మా ఊరికి రావాలంటే చాలా మంది వెనుకడుగేసేవారు. మా వాహనాలు కూడా చాలా వేగంగా పాడైపోయేవి. రోడ్డుపై నిత్యం ఎక్కడో చోట ప్రమాదం జరిగేది. రోడ్డు బాగు చేయాలంటే కాస్త ఎక్కువ నిధులు కావాలి. దీంతో గత పాలకులు దృష్టి సారించలేదు. ప్రస్తుతం మంత్రిగా ఉన్న అమర్‌నాథ్ ప్రత్యేక చొరవతో, ప్రభుత్వ పెద్దలతో మాట్లాడి నిధులు సమకూర్చారు. రోడ్డు నిర్మాణంతో మా గ్రామాల రూపురేఖలు మారిపోయాయి.

– పల్లెల సాయికిరణ్, కుంచంగి

20 ఏళ్లు నిలిచిపోయేలా..



మా గ్రామం నుంచి కొత్తూరు మీదుగా అనకాపల్లి రాకపోకలకు ఈ రోడ్డే మాకు ప్రధాన రహదారి. 20 ఏళ్లుగా చూస్తున్నా. ఈ రోడ్డు నిండా ఎప్పుడూ పెద్ద పెద్ద గోతులే. ఏడాది క్రితం బైక్‌పై వెళ్తూ కొత్తూరు దాటాక బీఆర్టీ కాలనీ వద్ద గోతిలో బండితో సహా పడిపోయాను. కాళ్లు చేతులకు గాయాలయ్యాయి. టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదు. అమర్‌నాథ్ తన ఎన్నికల హామీని నిలబెట్టుకున్నారు. 20 ఏళ్లు నిలిచిపోయేలా, పటిష్టంగా, నాణ్యతతో రోడ్డు నిర్మించారు.

– బాదపు హరికృష్ణ, సుందరయ్యపేట

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


వాహనదారులతో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ శ్రీను

అనకాపల్లిటౌన్: మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ శ్రీను హెచ్చరించారు. మండలంలో కొత్తూరు ఏఎంఏఎల్ కళాశాల కూడలిలో మంగళవారం రహదారి నిబంధనలపై వాహనదారులకు అవగాహన కల్పించారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్, అధిక వేగంతో వాహనాలు నడిపేవారిపై ఇప్పటికే నిఘా పెంచామన్నారు. డ్రైవింగ్ చేసేవారు తమ వాహనాలకు సంబంధించిన రికార్డులు తప్పనిసరిగా వెంట ఉంచుకోవాలన్నారు. పత్రాలు లేకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు. హెల్మెట్, సీట్ బెల్ట్ తప్పనిసరిగా ధరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్‌ఐ రమేష్, సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

చినుకులతో వరి రైతుల్లో గుబులు

కశింకోట: మండలంలో ఆకాశం మేఘావృతమై రెండు రోజులుగా అడపా దడపా వర్షాలు పడుతున్నాయి. దీంతో ఖరీఫ్ వరి సాగు రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు గ్రామాల్లో ముందుగా వేసిన వరి పంట కోత దశకు చేరుకుంది. కొన్ని చోట్ల వెన్ను దశలో ఉంది. ఈ నేపథ్యంలో అకాల వర్షాలు పడుతుండటంతో రైతుల్లో గుబులు నెలకొంది. ఈ ఏడాది సరైన వర్షాల్లేకపోయినా నీటి వసతి ఉన్న చోట ఆరు గాలం కష్టపడి పంట పండించారు. అడ్డాం, కన్నూరుపాలెం, చెరకాం తదితర గ్రామాల్లో ఇప్పటికే కొందరు రైతులు కోతలు మొదలు పెట్టారు. ఈ పరిస్థితిలో వర్షాలు పడుతుండటంతో తాము నష్టపోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సోమ, మంగళవారాల్లో కురిసిన చిరుజల్లులతో ప్రస్తుతానికి పెద్దగా నష్టం లేకపోయినా, కాస్త ఎక్కువ వర్షం పడితే ఇబ్బంది తప్పదంటున్నారు. కశింకోట, వెదురుపర్తి, నరసింగబిల్లి, ఎఎస్ పేట, సోమవరం, గొబ్బూరు, అచ్చెర్ల, తదితర గ్రామాల్లో నీటి సదుపాయం ఉన్నచోట వరి ఎదుగుదల, ఈనడం, వెన్నులు వేసి పాలు పోసుకోవడం, ధాన్యం గింజ కట్టడం తదితర దశల్లో ఉంది. బయ్యవరం, పరవాడపాలెం, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, జి.భీమవరం, కొత్తపల్లి, బుచ్చియ్యపేట తదితర గ్రామాల్లో నీటి సదుపాయం లేక, నాటిన తర్వాత సరైన వర్షాలు కురవక, వరి పొలాలు ఎండిపోయే దశకు చేరకున్నాయి. ఇక వర్షాలు కురిసినా అవి కోలుకునే పరిస్థితి లేదు. ఇలా 474 ఎకరాల మేర ఎండిపోయిన స్థితిలో ఉన్నట్లు ఉన్నతాధికారులకు నివేదించినట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న తెలిపారు.


కశింకోటలో వెన్ను దశలో ఉన్న వరి పొలం

నేడు గుడివాడ గురునాథరావు వర్ధంతి

అనకాపల్లిటౌన్: పట్టణ, మండల పరిధిలోని పలు ప్రాంతాల్లో దివంగత మాజీ మంత్రి గుడివాడ గురునాథరావు 22వ వర్ధంతి వేడుకలు బుధవారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, ఎంపీపీ గొర్లి సూరిబాబులు మంగళవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. స్థానిక రింగ్ రోడ్డులోని మంత్రి అమర్‌నాథ్ క్యాంపు కార్యాలయంలో ఉదయం 10 గంటలకు గురునాథరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి, నిరుపేదలకు వస్త్రాలు పంపిణీ చేయనున్నట్లు పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు హాజరుకావాల్సిందిగా కోరారు.

కశింకోట: కశింకోట పంచాయతీ కార్యాలయంలో బుధవారం ఉదయం 10 గంటలకు దివంగత గుడివాడ గురునాథరావు వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు తెలిపారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, పార్టీ శ్రేణులు, అభిమానులు, స్థానిక ప్రజలు హాజరుకావాల్సిందిగా కోరారు.

సీఎం జగన్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు


మార్టూరులో సంక్షేమ లబ్ధి ఫ్లెక్సీని ఆవిష్కరించిన దిలీప్‌కుమార్ చిత్రంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు


కొత్తపల్లి సచివాలయంలో సంక్షేమ లబ్ధి ఫ్లెక్సీ ఆవిష్కరిస్తున్న ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యుడు


భీమునిగుమ్మంలో పార్టీ జెండాను ఆవిష్కరిస్తున్న దిలీప్‌కుమార్, కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మి, జానకీ రామరాజు, మురళీకృష్ణ, రమేష్ తదితరులు

- ఘనంగా 'వై ఏపీ నీడ్స్ జగన్'
- రచ్చబండ, పల్లె నిద్రలో నాయకులు

అనకాపల్లిటౌన్: పేదలకు అవసరమైన విద్య, ఆరోగ్యంతోపాటు వారి జీవన ప్రమాణ స్థాయిని పెంచేలా సంక్షేమ పథకాల అమలుతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పేదల గుండెల్లో సుస్థిర స్థానాన్ని సంపాదించుకున్నారని 83వ వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అన్నారు. పట్టణంలోని 9వ సచివాలయం పరిధి భీమునిగుమ్మంలో మంగళవారం ఏపీకి జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమం పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌తోనే రాష్ట్ర భవిష్యత్తు ముడిపడి ఉందన్నారు. రాష్ట్ర ప్రజల మనసుల్లో సంక్షేమ సారథిగా జగన్ చిరకాలం నిలిచిపోతారని పార్టీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీ రామరాజు అన్నారు. పండుటాకులకు ప్రతి నెల 1వ తేదీనే పింఛన్ అందిస్తూ వారి బతుకులకు ఆసరాగా సీఎం జగన్ నిలిచారని, అలాంటి వ్యక్తినే మళ్లీ సీఎంను చేసుకోవాలని అవ్వాతాతలు ఆనందంగా చెప్తున్నారని సచివాలయాల కన్వీనర్ కొణతాల మురళీకృష్ణ పేర్కొన్నారు. జగనన్న కాలనీలు ఊళ్లను తలపిస్తున్నాయని పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ అన్నారు.

అంతకు ముందు సంక్షేమ పథకాల బోర్డును ఆమె ఆవిష్కరించి, సచివాలయ పరిధిలో ప్రజలకు ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. ప్రజల అభిప్రాయాలను లిఖితపూర్వకంగా తీసుకున్నారు. పార్టీ జెండాను ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ ఆవిష్కరించి అక్కడ రచ్చబండ నిర్వహించారు. కార్యక్రమంలో జీవీఎంసీ జెడ్సీ ఎస్.వెంకటరమణ, 84వ వార్డు ఇన్‌చార్జి కోరుకొండ రాఘవ, పార్టీ శ్రేణులు సమ్మంగి కనకారావు, బెల్లాన అనురాధ, కొణతాల సత్తిబాబు, కందలాడ సాయి, లంబా అనిల్, బంగారి చంటి, డి.హేమంత్, యల్లపు రామచంద్రరావు, నడిశెట్టి మధు, పాము సన్నిబాబు, కొడుకుల సుబ్రహ్మణ్యం, కొమ్మన శంకర్, నాగులాపల్లి వీర్రాజు, కోన ఉమ, పేకూరి కల్యాణ్, డొంక సత్తిబాబు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొన్నారు.

మార్టూరులో...

నవరత్న పథకాల అమలుతో రాష్ట్ర ప్రజల అభ్యున్నతి తమ ప్రభుత్వం కృషి చేసిందని ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలోని మార్టూరు పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన ఏపీకి జగనే ఎందుకు కావాలంటే .. కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. సంక్షేమ పథకాలు పేదలకు నేరుగా చేరుతున్నాయంటే దానికి కారణం జగనే అన్నారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా భావించి పాలన సాగిస్తున్న వ్యక్తి జగన్ అని కొనియాడారు. తొలుత సంక్షేమ పథకాల లబ్ధి ఫ్లెక్సీని దంతులూరి దిలీప్‌కుమార్ ప్రారంభించి ఎవరెవరికి ఏ మేరకు లబ్ధి చేకూరిందో వివరించారు. సచివాలయం వద్ద పార్టీ జెండా ఆవిష్కరించి గ్రామస్తులకు జగనే ఎందుకు కావాలంటే..? బ్రోచర్లను అందించి, అక్కడే పల్లెనిద్ర చేశారు.

కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షుడు కరణం నాగేశ్వరరావు, సర్పంచ్ కరణం రెవెన్యూనాయుడు, ఎంపీటీసీ మిద్దె రాజా చంద్రరావు, ఏఎంసీ డైరెక్టర్ ఒమ్మి మధుబాబు, వార్డు సభ్యులు బేతా పెంటారావు, కాకర దేముడు, మండే సోమినాయుడు, అల్లం రాము, తోట నూకరత్నం, కోట్ని రామారావు, కరణం రమణమ్మ, కొప్పాక లీలావతి, కరణం అరుణ, పెట్ల కనక, కరణం రత్నం, కరణం వెంకట నాగేశ్వరరావు, సచివాలయ కన్వీనర్లు దంట్ల వరలక్ష్మి, నమ్మి గోవింద్, కరణం కృష్ణ, పోల్నాటి ప్రకాష్, వైస్ ఎంపీపీ విల్లూరి కుమారి, చంద్రశేఖర్, దంతులూరి కల్యాణ్‌చక్రవర్తి, ఎంపీడీవో కె.నర్సింహారావు, ఈవోపీఆర్డీ ధర్మారావు, వలంటీర్లు, గృహ సారథులు పాల్గొన్నారు.

కశింకోట: ప్రతి సచివాలయ పరిధిలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ కలగా లక్ష్మి అన్నారు. మండలంలోని కొత్తపల్లి సచివాలయంలో 'ఆంధ్రప్రదేశ్‌కి జగనే ఎందుకు కావాలంటే..' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు కొత్తపల్లి సచివాలయ పరిధిలోని కొత్తపల్లి, బుచ్చియ్యపేట గ్రామాలకు ప్రత్యక్షంగా రూ.16.25 కోట్లు, పరోక్షంగా రూ.5.32 కోట్లతో పలు అభివృద్ధి, సంక్షేమ లబ్ధి చేకూరిందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు మాట్లాడుతూ నిరంతరం ప్రజా సంక్షేమం,అభివృద్ధే ధ్యేయంగా సీఎం జగన్ సేవలందిస్తున్నారని కొనియాడారు. ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావడానికి ప్రజలు సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. ముందుగా సచివాలయ ప్రాంగణంలో పార్టీ పతాకాన్ని ఎంపీపీ, జెడ్పీటీసీలు ఆవిష్కరించారు. సచివాలయం వద్ద గత నాలుగున్నరేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల లబ్ధి వివరాలు తెలిపే డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. అనంతరం సచివాలయ పరిధిలో ప్రభుత్వం అందించిన పథకాలను వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు.

కార్యక్రమంలో పార్టీ మండలాధ్యక్షుడు మలసాల కిషోర్, మండల సచివాలయాల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు, ఎంపీడీవో వీవీ రవికుమార్, కొత్తపల్లి సర్పంచ్ కన్నం శ్యాంసన్, బుచ్చియ్యపేట సర్పంచ్ కోన నాయుడు, వైఎస్సార్ సీపీ నాయకులు అద్దెపల్లి శ్రీనివాసరావు, బుదిరెడ్డి రామారావు(బుల్లెట్ రాజు), పి.గోవిందరావు, బి.చెల్లయ్యనాయుడు, ఎస్.నాగసూరి అప్పారావు(ఖాన్), ఉప సర్పంచ్ సుంకర దేవి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.